చక్రపాణికి ఒళ్ళు మండిపోయేటంత కోపంగా వుంది. ఛీ!- విరక్తికూడా వేస్తోంది!

అప్పారావుమీద, నాగయ్యమీద, బస్సుమీద, ఆ మాలాసిన్హాలాంటి సుదతీమణిమీద - తనమీద - ఈ పాడు ప్రపంచంమీద-కోపంగా వుంది. దుఃఖంకూడా వస్తోంది—

అకౌంట్సులో 20 ఏళ్ళు సర్వీసుంది గనక జ్ఞాపకం వుంది టిక్కెట్ నెంబర్! (ఎందుకైనా మంచిదని-ఆశ చెడ్డదిగా) 3245670 అని మననం చేసుకుంటూ అకౌంటెంట్ చక్రపాణి - బాధగా, దుఃఖంగా, కోపంగా, జాలిగా, కాళ్ళీడ్చుకుంటూ ఇంటిమొహం పట్టాడు!

# పరిమళా పరిణయం

ప్రొద్దున్న నిద్ర లేస్తూనే నేను మా ఫ్యాక్టరీ పొగ గొట్టంలోనుంచి వచ్చే తెల్లని పొగ చూస్తాను. అలా అలా ఆకాశంలోనికి చిన్న చిన్న మేఘాలుగా ఆ పొగ చేరుతూ వుంటే ఒక్క- క్షణం తృప్తిదీరా చూస్తే తప్ప నా నరాల్లోకి సత్తువ రాదు.

మొదటి సైలన్ వినబడేసరికి నా స్నానం అయిపోయి, డ్యూటీ బట్టలు తొడుక్కోవడంకూడా పూర్తయిపోతుంది. చొక్కా గుండీలుమాత్రం పెట్టుకోవలసి వుంటుంది.

"ఏమమ్మోయ్! వస్తున్నావా?" అని కేకలేస్తాను.

"ఇదుగో వస్తున్నా, మీదే అలస్యం నేను రెడీ.... ఏదీ ఇంకా రెండోసారి మా "అత్తగారి పిలుపు వినబడ లేదుగా" అంటూ మా ఆవిడ నిండుగా సర్దిన కారియర్ పట్టుకువస్తుంది.

ఫ్యాక్టరీని నేను మా కన్నతల్లి అంటాను. అందుకని మా ఆవిడ అన్నపూర్ణ అత్తగారంటుంది.

"కాస్త ఈ చొక్కా గుండీలు పెట్టేదూ" అన్నాను. నా ఎత్తుగడ గ్రహించిన అన్నపూర్ణ నవ్వుతూ "మీరు మరీనూ...మంజేతి కంకణానికి అద్దం పట్టమంటారూ" అంటూ దగ్గరగా వచ్చిందో లేదో అవతల సైకిల్ బెల్ చప్పుడు....

"అదుగో వచ్చేశాడు మీ పైలట్" అంటూ అన్నపూర్ణ లోపలికి కాఫీ తేవటానికి పరిగెత్తింది.

వచ్చినవాడు సత్యం, మా ఫ్యాక్టరీలో ఈమధ్య 'గ్రేడ్ వన్ ట్రయినీగా' చేరాడు.

"ఏం బావగారూ? రెడీయేనా?" అంటూ టకటకా ఇంట్లోకి వచ్చాడు.

"ఆహా! రెడీయే! అదిగో మీ అక్కయ్య నీ కాఫీ కప్పుతో ప్రత్యక్షమయిందిగా, అది సేవించు పోదాం" అన్నాను.

"అయితే అక్కయ్యా! మీరు నన్ను కేవలం కాఫీ కోసం వస్తున్నవాడిగా చేసేస్తున్నారు....అంతేగా" అన్నాడు సత్యం రోజూ కాఫీ త్రాగటం యిష్టంలేనట్లు మొహంపెట్టి.

"తాగవయ్యా తమ్ముడూ! ఇంతలో మీ బావగారి ఆస్తులేమీ కరిగిపోవు" అన్నది అన్నపూర్ణ.

సైరన్ రెండోసారి అందుకుంది. మేం ఇద్దరం బైట కొచ్చేశాం.

సత్యం నన్ను రోజూ సైకిలెక్కండి డబుల్స్ పోదాం అనడం.... నేనేమో లేబర్ కాలనీలో నలుగురూ నవ్విపోతా రేమో పోనిద్దూ అని సిగ్గుపడ్డం-ఇవి మామూలే!

ఫ్యాక్టరీకి వెళ్ళే తోటివారిని కలుసుకుంటూ ముందు పిట్టవాళ్ళని పలకరించుకుంటూ ఫ్యాక్టరీ చేరుకుంటాం. అక్కడ విడిపోతాం...

•

కొన్ని అనుబంధాలు విచిత్రంగా వుంటాయి....సత్యం వచ్చి ఆర్నెల్లయింది. చదువుకున్నవాడు, యువకుడు, బుద్ధిమంతుడు...ఓసారి సినిమాహాలుదగ్గర మా ఇద్దరికీ కలిశాడు. ఇంటికొచ్చాడు. అంతే... అన్నపూర్ణకి తమ్ముడూ, నాకు బామ్మరిదీ లేని కొరత తీర్చాడు.

అతనికి క్వార్టర్స్ ఇవ్వలేదు ఇంకా. అందుకని ఊళ్ళో బ్రహ్మచారుల భవనం ఓదానో వుంటున్నాడు. ఆఫ్లొచ్చినా, శలవులొచ్చినా ఇంక మాతోనే గడిపేస్తాడు. అయినా అతని గురించి. అతని కుటుంబ వివరాలు అవీ మాకంతగా తెలియు

వనే ఒప్పుకోవాలి. వాళ్ళ నాన్నగారు చాలా పెద్ద సంపన్నుడే అయి వుండాలి...ఏదైనా మాట పట్టింపులమీద దూరా భారం వచ్చి ఈ ఫ్యాక్టరీలో చేరాడేమో!

సత్యంతో మా అనుబంధం ఎంత పెనవేసుకుపోయింది అంటే మా ఆవిడ "తమ్ముణ్ని కూడా ఇక్కడే మన ఇంట్లోనే వుండమనండి. అక్కడెక్కడో హోటల్లో తింటూ వుండటం ఎందుకు" అనేది.

సత్యం "వద్దక్కయ్యా! మీ రుణం ఇప్పటికే నాకు తలకు మించిన భారం అయింది"అని తప్పుకునేవాడు.

నేను మా యూనియన్‌లో ఏక్టివ్ మెంబర్‌గా వుండే వాణ్ని. మా కులం పెద్దలు అంటే కార్మికకులం అన్నమాట! గురువులుగారు, నర్సింహం, డేవిడ్, మస్తాన్ భాయ్ వీళ్ళం దరూ కూడా "ఏయ్ మూర్తీ! మీ బామ్మర్ది వస్తున్నా" డనేవాళ్ళు సత్యం అల్లంత దూరానుండగానే.

కానీ ఒకరోజు సత్యం రాలేదు. నేను రెండో సైరన్ అయిపోయిన తర్వాత రెండు మూడు నిముషాలు ఎదురు చూశాను. నాకామాత్రం ఆలశ్యంకూడా ఎన్నడూ ఇష్టం లేదు, మూడోపుంగాకి నేను "టర్నర్" లందరినీ పలుకరించి నా "బర్నర్" దగ్గరికి వెళ్ళిపోవాల్సిందే!

అన్నపూర్ణతో "సత్యం వస్తే సైకిల్ మీద తిన్నగా పొమ్మను నే వెళ్తున్నా" అని కేకేసి పరుగెత్తినంత వేగంగా వెళ్ళిపోయాను.

*　　*　　*

సాయంకాలం నేను ఇంటికి వస్తూనే కారియర్ మా ఆవిడ కందిస్తూ "మీవాడు ఎగ్గొట్టినట్టేనా?" అన్నాను.

"శెలవు పెట్టాట్టలెండి—మీరు ముందు స్నానంచేసి ఫలహారం అయ్యాక చెప్తానంది" అన్నపూర్ణ.

నాకు ఇదేదో 'పజిల్' లాగా వుంది. అయినా స్నానం చేయనిదే అన్నపూర్ణతో ఇక మాట్లాడలేం.

వెళ్ళి తొందరగా స్నానం చేసి ముగించుకొచ్చాను

"వాళ్ళ మరదలొచ్చిందిట...." అన్నది అన్నపూర్ణ నన్ను కొంచెం ఫలహారం చేయనిచ్చి.

"మరదలా? సత్యానికో మరదలుందన్న మాట—ఎవరితో వచ్చిందిటా? ఎక్కడుందిటా?" అన్నాను. నాలో నాతో కుతూహలం రెట్టింపయింది.

"పాలిటెక్నిక్ కాలేజీలో చదువుకుంటూందట—వాళ్ళ మేనమామ కూతురట! పేరేమో 'పరిమళ'. వాళ్ళ కాలేజీవాళ్ళంతా "టూర్"కి వొచ్చారట. వాళ్ళతో వచ్చిం దిట—సరే! చెట్టంత బావ ఈ వూళ్ళో వుంటే చూడకుండా ఎలా వెళుతుంది?" అన్నది మా ఆవిడ.

"అలాగా! మరి మా ఫ్యాక్టరీ చూడకుండా కాలేజీ ఇండస్ట్రియల్ టూర్ ఏదీ పూర్తికాదే" అన్నాను నేను.

"ఏమో బాబూ! అదంతా నాకు తెలియదు. సత్యం గాభరా గాభరాగా వున్నాడు. ఆ పిల్లనీ, సత్యాన్ని రాత్రి

భోజనానికి రమ్మన్నాను అదొక్కటే నాకు తెలుసు. కాస్త సెంటరుకు పోయి ఏదైనా కూర తెండి" అన్నది అన్నపూర్ణ.

బంధుప్రీతి గల ఇల్లాలు - అదీగాక పేరే అన్నపూర్ణ మా ఆవిడ కమ్మగా వంటచేసింది. కానీ లేబర్ క్వార్టర్స్ లోకి వచ్చే ఆఖరి సిటీబస్‌కూడా వెళ్ళిపోయినట్లున్నా సత్యం, సత్యం మరదలు "పరిమళో" పరిమళమో వీళ్ళ వాసన ఎక్కడా తగల్లేదు.

నేను ఎదురు చూసి-చూసి "ఇకరారేమో, హోటల్లో మరదలికి స్పెషల్ భోజనం పెట్టించాడేమో మీ సత్యం" అంటూ భోజనం ముగించాను.

మేం సత్యం, సత్యం మరదలుగురించే ఆలోచిస్తూ పడు కున్నాం. పదకొండే అయిందో, పన్నెండే అయిందో గానీ ఆటోరిక్షా చప్పుడు వినిపించి మేం లేచి బయటకు వచ్చాం.

సత్యం, ఆ వెనకాతలే ఓ పద్దెనిమిదేళ్ళ పడుచుపిల్లా తప్పుచేసిన స్కూలుపిల్లల్లా దిగారు.

"ఏం సత్యం? దారితప్పిపోయారా?" అన్నాను నేను ఇద్దరినీ లోపలికాహ్వానిస్తూ.

"రా పరిమళా! ఇప్పుడే చూసి చూసి మీ అన్న గారూ, నేనూ భోంచేశాం. మీ యిద్దరికీ అన్నీ వుంచామను కోండీ" అని కలుపుగోలుగా మా ఆవిడ పరిమళను ఇంట్లోకి తీసుకువెళ్ళింది.

సత్యం నోట మాట మామూలుగా వచ్చేటంత సాఫీగా రాలేదనిపించింది నాకు.

"వాళ్ళ ఫ్రెండ్స్‌తో సినిమాకి-సినిమాకి——" అంటూ నసిగాడు.

పరిమళను చూడగానే మాకేదో జాలివేసింది. సన్నగా, నాజూగ్గా వున్నప్పటికీ మొహం పీక్కుపోయి దీనంగా వుంది.

అన్నపూర్ణ బలవంతంమీద భోజనం చేశారు వాళ్ళు. సత్యం నాతో ఒక్కమాట మాట్లాడలేదు. సొంత అక్కయ్య చాటు తమ్ముడులాగ మా అన్నపూర్ణ వెనకనే దాక్కున్నాడు సత్యం.

ఆ రాత్రి పరిమళను మాత్రం మా యింట్లో వుంచి తను గదికి తిరిగి పోతాననా్నడు. కాని నేనే "అర్ధరాత్రి అయింది. అవతల దొడ్లో మంచాలు వేసుకుని పడుకుందాం మనిద్దరం" అని వుంచేశాను.

తెల్లారింది. సైరన్‌కి సైరన్‌కిమధ్య నేనింకేం మాట్లాడ లేదు. ఇంచుమించు డ్యూటీమీదకు వెళ్ళిపోయినట్లుగా-

సత్యం నా ప్రక్కన నడుస్తున్నాడే కాని మనిషి మని షిలో లేడు.

సాయంకాలం గేటుదగ్గర నాకోసం ఎదురు చూస్తూ సత్యం లేడు. పెరుమాళ్ళు చెప్పాడు మధ్యాహ్నం శలవు పెట్టాడని.

మరదలుపిల్ల వచ్చిందికదా! మనసిక్కడెలా వుంటుం దిలే" అనుకున్నాను.

మా లేబర్ కాలనీలో ఓ అరవై, డెబ్బై క్వార్టర్సు వున్నా అంతా ఓ లోగిలిలాగ వుంటుంది. ఒక యింట్లో నిప్పు రాజితే పొగ అందరిళ్ళకీ కనబడుతుంది.

సత్యం-పరిమళ-ఈపాటికి మావాళ్ళందరికీ కుతూహల జనకమైన అంశమే అయ్యుండాలి. పరిమళ మంచి అభిజాత్య మున్న పిల్లలాగే వున్నది. పాలిటెక్నిక్‌లో చదువుతున్నదట. ఏం కోర్సో! అసలు సత్యం యింతవరకూ ఎన్నడూ తనకో మేనమామ వున్నట్లుగానీ, ఆ మామకో కూతురున్నట్లు కాని చెప్పనేలేదు. మిగతా విద్యార్థులతో వచ్చిన పరిమళ తన సంచీకూడా తెచ్చేసుకుని ఎందుకొచ్చినట్లు? సత్యం ఉదయా న్నుంచి ఎప్పుడూ వాగే నోరు కట్టేసుకుని "కీ" అయిపోయిన మరబొమ్మలాగా ఎందుకు వుండిపోయినట్లు?

ముసిరే చీకట్ల మధ్య చెలరేగే ఆలోచనలతో ఇల్లు చేరుకున్నాను. ఇంట్లో పరిమళా, సత్యం వున్న అలికిడిలేదు. అన్నపూర్ణ చెప్పింది. "పరిమళను వాళ్ళ స్నేహితుల దగ్గర వదిలి వస్తానని వెళ్ళాడు సత్యం. పరిమళకు ఒక జాకెట్ గుడ్డ, పసుపూ, కుంకుమా యిచ్చి పంపింది అన్నపూర్ణ. "పాపం! ఎంత మంచిపిల్ల! ఎంతో అమాయకురాలిలాగ వుందండీ!" అన్నది.

"సత్యం ఈ పిల్లను ప్రేమిస్తున్నాడా?" అన్నాను.

అన్నపూర్ణ గలగలా నవ్వింది.

"నన్నడిగితే నేనేం చెప్పను? పరిమాళ మాత్రం సత్యాన్ని తప్ప మరొకన్ని పెళ్ళి చేసుకొనేలాగ లేదు."

అంటూ పరిమళ దగ్గర తను సేకరించిన మరికొన్ని వివరాలుకూడా చెప్పింది.

పరిమళకు సత్యం బావ వరసే గానీ మేనబావ కాదు. ఆ ఇద్దరూ నిజానికి స్నేహితులు. పరిమళ తండ్రి కొంతకాలం క్రితంవరకూ సత్యం తండ్రివద్ద గుమాస్తాగా చేశాడు. ఈ మధ్యనే గిట్టైరై పోయాడు. సత్యం తండ్రి ధనంజయరావు బాగా డబ్బున్నవాడు.

"అయితే ఇప్పుడు పరిమళ నిజంగా ఈ "పరిమళ" టూరుమీద వచ్చిందంటావా? ఒక్కర్తే వచ్చిందంటావా?" అన్నాను.

నాకొచ్చిన అనుమానమే అన్నపూర్ణకి వచ్చినట్లుంది.

"అంతా ఏదో అయోమయంగా వుందండీ. వాళ్ళిద్దరి ధోరణి చూస్తుంటే నిన్నరాత్రి సినిమాకు పోయినట్లు లేదు. బాగా ఘర్షణ పడ్డట్లున్నారు—ఇవాళ మన ఇంటకూడా నా కనుచాటైతే చాలు ఆ ఇద్దరిమధ్యా కొంత గుంజాటన, ఘర్షణా జరిగాయి. సత్యం మీ వూరు పొమ్మని, పరిమళ పోననీ పోట్లాడుకుంటున్నట్లుగా అనిపించింది. అని చెప్పింది అన్నపూర్ణ.

పరిమళ గురించి జాలిగుండె గల అన్నపూర్ణ మరీ చలించిపోయినట్లుంది. "ఆ పిల్ల వెళ్ళేటప్పుడు నన్ను కౌగలించుకుని బావురుమన్నదండీ" అన్నది.

"అయ్యో!" అనిపించింది నాకు.

"సత్యాన్ని నిలదియ్యలేకపోయావా?" అన్నాను నేను.

అన్నపూర్ణ ఎక్కడో ఆలోచిస్తున్నట్లుంది. మాట్లాడలేదు. నిజానికి పరిమళ చెప్పిన కథ యావత్తు అన్నపూర్ణ నాకు చెప్పిందా? లేక ఏమైనా దాస్తున్నదా? అన్న అనుమానం నాలో కలగకపోలేదు.

రేపుదయం సత్యం వస్తే అడుగుదాంలే అనుకున్నాను. ఆ అనుకున్న మాటలే పైకి గట్టిగా అన్నాను. నిజానికి మా యిద్దరికీ సరిగ్గా నిద్రపట్టలేదు. ఎంతట తెల్లారుతుందా అనిపించింది.

కానీ ఉదయం రెండోపుంగా వేళకికూడా సత్యం రాలేదు. డ్యూటీమీద వున్నాననేగానీ నాకేం తోచలేదు. లంచ్ టైమ్‌లో సత్యంవాళ్ళ సెక్షన్ ఇన్‌చార్జి గురుమూర్తిని కలిశాను. మాటల సందర్భంలో సత్యం ప్రస్తావన రానే వచ్చింది.

"మీవాడు నీకు చెప్పలేదా? పదిహేను రోజులు మెడికల్ లీవుమీద వెళ్ళాడు. వాళ్ళ నాన్నగారూ, కంపెనీ డైరెక్టర్‌గారి బావమర్దికూడా క్లోజ్ ఫ్రెండ్సట! వాళ్ళ నాన్న

గారి దగ్గరినుంచి డైరెక్టర్ ,బామ్మర్దికి లెటర్ వచ్చిందిటా" అన్నాడు.

"ఆఁ అవును..." అన్నానే గానీ నామీద నాకే అసహ్యంవేసింది. సత్యాన్ని నా బామ్మర్ది అంటారంతా. కాని అతగాడి గురించిన సత్యం ఒక్కటీ నాకు తెలీదు.

సాయంకాలం వస్తూనే ఈ కోపమంతా అన్నపూర్ణ మీద చూపించాను. "తమ్ముడూ తమ్ముడూ అన్నావు. వాడేమో మనల్ని వట్టి ఫూల్స్‌ని చేశాడు" అన్నాను.

"మొదట మీరు పోయి సత్యం గదిలో వుంటే నాలుగూ అడిగి రండి" అన్నది అన్నపూర్ణ.

"ఎందుకుటా? ఎవడేం మనకా సత్యం.... నేలని పోయేది నెత్తిన రాసుకున్నట్లు...ఓ రాత్రి ఆశ్రయమిచ్చాం ఆ పిల్లకి. ఆ నేరానికి...." అని నేనంటూ వుండగానే—

"శిక్ష అనుభవించాలి మనం - తప్పదు. పోయిరండి. నామీద ఒట్టే!" అంది అన్నపూర్ణ.

నేను చకితుణ్ని అయ్యాను. అన్నపూర్ణ మనసు నవనీతం.ఇంత నొచ్చుకుందేనని ఇక లాభంలేదనుకుంటూ సత్యం గదికి వెళ్ళాను.

తలుపు తాళంలేదు. తలుపు తట్టాను. ఎవరో భయం భయంగా తెరుస్తున్నట్లు తెరుచుకుంది.

లోపలికి తొంగిచూశాను. పరిమళ నన్ను చూసి ధైర్యంగా తలుపుతీసింది.

గది అంతా చిందరవందరగా వుంది. పరిమళ సంచీ సగం తెరచి వుంది. పక్క నలిగివుంది. కాయితాలూ, మూత తెరచి వున్న కలం అలాగే దిండుకిందకు తోసేసినట్లు కనిపిస్తున్నాయి.

"సత్యం లేడామ్మా" అన్నాను.

పరిమళ నోరు విప్పలేకపోయింది.

దుఃఖానికి అడ్డుకట్టగట్టి మాట పెగల్చాలన్న ఆ పిల్ల ప్రయత్నం ఫలించలేదు. నట్టిగా ఏడ్చేసింది—నా పరిస్థితి సంకటమైంది. ఏం చేయాలో తోచలేదు.

"పద యింటికి పోదాం ముందు" అన్నాను. ఆమె సంచీ తీసుకున్నాను.

దిండుక్రింద కాయితాలూ, కలంకూడా ఎలా వున్నవలాగే అందులో పడేశాను. నలుగురూ చేరేలోగానే, చుట్టుపట్లవాళ్ళు అందరూ కుతూహలంతో ఇటు రాకముందే బయటపడాలనిపించింది.

'పరిమళ' మానసికంగా బాగా కృంగిపోయిందేమో నిర్జీవ ప్రతిమలాగ నన్ను అనుసరించిందే గాని, నోరు మెదపలేదు.

ఆమె కనుకొలుకల నీరెప్పుడో యింకిపోయినట్లుంది. త్రోవలో నేను మాట్లాడిందొక్కటే మాట. "నేను నీ సొంత అన్నయ్యనే అనుకోమ్మా! ఈ కూలివాడు డబ్బుకు పేదవా

డయినా అన్యాయాన్నెదిరించడానికి ఎన్నడూ జంకడమ్మా” అని [illegible] ఆ మాటలుకూడా ఆటో రిక్షా రొదలో పరిమళ విన్నదో లేదోకూడా నాకు తెలియదు.

* * *

అన్నపూర్ణకు పరిమళను అప్పగించి సంగతంతా తాపీగా కనుక్కో అన్నాను. ఆ రాత్రి ఎందుకైనా మంచి దని బయట యింటికి గొళ్ళెం పెట్టుకుని వరండాలో పడు కున్నాను. మర్నాడు తెలిసింది—రాత్రి చాలా మంచిపని చేశానని.

సత్యమంటే అన్నపూర్ణకు వాత్సల్యమంతా కోపంగా మారిపోయింది. అసలు కథ అంతా ఆమె రాబట్టగలిగింది.

పరిమళా, సత్యం ప్రేమించుకున్నారు. ఉత్తరాలు గట్రా రాసుకుంటున్నారు కూడా. ఇది సత్యం తండ్రికి ఇష్టం లేదు. బాగా సంపన్నుల యింటి సంబంధమే తప్ప అతనికి ఈ అంతస్తులు కలవని పెళ్ళి యిష్టంలేదు. సత్యం తండ్రితో పోట్లాడి ఈ వూరొచ్చి ఈ ఫ్యాక్టరీలో చేరాడు తాత్కాలి కంగా తప్పించుకునేటందుకు కాబోలు....

అయితే పరిమళ యింటివాళ్ళుకూడా గుండెలమీద కుంపటిలాంటి ఆడపిల్లని ఈ అపవాదుతో ఎక్కువ రోజులు యింట్లో పెట్టుకోదల్చుకోలేదు. మెడ వంచి మరీ ఆ పిల్లకు పెళ్ళి చేసేయాలనుకున్నారు.

పరిమళ తెగించింది. సత్యంమీద విశ్వాసముంచి

యింట్లోనుంచి అన్ని ఋణాలను, బంధాలూ త్రెంతేసుకుని చీకటిరాత్రి రై లెక్కి_పోయింది.

అయితే డబ్బూ, అనుభవమూ కల సత్యం తండ్రి సత్యం జాడ తెలుసుకుని తన పలుకుబడిని వినియోగించి మరీ సత్యానికి కబురుపెట్టి యిలా లాక్కుపోయాడన్నమాట!

సత్యం ఎంత చెప్పినా పరిమళ మానాభిమానాలు పోగొట్టుకుని తిరిగి యింటికి పోనంది. మూడుముళ్ళూ వేసి తీసుకుపోతే తప్ప కన్నవారి ఊరు మరి చూడనంది. అయితే సత్యం అటు తండ్రి, యిటు పరిమళ—మధ్యనపడి చివరికి పరిమళకు రైలు టిక్కెట్‌కు చాలినంత డబ్బు, దారిఖర్చులు యిచ్చి, నీమట్టుకు నీవు మీ యింటికి పో...కొంతకాలం ఆగాక గాని నేను ఏమీ చేయలేను" అంటూ ఆ పిల్లని ఆ పిల్ల ఖర్మానికి ఆ గదిలో వదిలి డూప్లికేట్ తాళంచెవి జేబులో వేసుకుని పోయాడు.

ఇదంతా జరగటానికి ఎంతో కాలం పట్టలేదు. రెండు సూర్యోదయాలైనాయంతే!

నాకేం చేయాలో తోచలేదు.

పరిమళను ఆరోజు తీసుకుని వచ్చి వుండకపోతే ఆ పిల్ల ఏ రైలుక్రిందో పడి వుండేదిట! ఆ ఉత్తరాలు రాయటం గట్రా అంతా ఆత్మహత్యకు పాల్పడటానికే....

పరిమళను చేరదీసిన నేరానికి అన్నపూర్ణ అన్నట్లు మాకు ఈ రంపపుకోత, శిక్షా తప్పలేదు. నేను శెలవుపెట్టాను. ఎప్పుడూ లేనిది నేను అకస్మాత్తుగా శలవు పెట్టడంతో మా వాళ్ళంతా యింటికొచ్చేశారు.

గురువులు, నరసింహం, మస్తాన్ భాయ్, అంతా కూడా ఈ "కథ" వినటమే మంచిది అనుకున్నాను. పదండి యూనియన్ ఆఫీసుకు పోదాం అన్నాను.

అక్కడ మేం పదిమందిమీ సత్యం పరిమళల సమస్యను మథించాం....ఇదేం లేబర్ కోర్టుకు పోయే సమస్య కాదే....కాని మీ సత్యం మా తోటి కార్మికుడు అసత్యవాదై పోయాడు. మా యింటికి శరణు అంటూ న్యాయం కోరి వచ్చిన పరిమళ జీవితం దుర్గంధభరితమయ్యే ప్రమాదం ఏర్పడిపోయింది.

ఎట్లా! ఎట్లా!

ఇది మా అందరి సమస్యగా పరిష్కరించాలి అనుకున్నాం. ఆలోచించి లేచాం ధైర్యంగా....

* * *

మా కార్యక్రమంలో మొదటిదశ మా ఫోర్మన్‌ని పట్టుకుని అతనిద్వారా సత్యానికి టెలిఫోన్ చేయించాం. ఉద్యోగం పోతుంది రమ్మని బెదిరించామన్నమాట! సత్యం రాలేదు. సరే, కార్మికవాడ సంకల్పించిన పెళ్ళి ఆగుతుందా?

నేను, అన్నపూర్ణ కన్యాదాతలుగా వుండటానికి నిశ్చయించుకున్నాం. గురువులు తన కానుకగా కొత్తదంపతులకు మంచం, కుర్చీలాంటి ఫర్నీచర్ చేయిస్తున్నాడు. నరసింహం మస్తాన్ భాయి అంతా కలిసి కాలనీ అంతా తిరిగాం.

కొత్త సంసారానికి కావల్సిన గిన్నె, ముంతా మొదలు రోలూ, రోకలీ, చీపురూ, చేటా అన్నీ ఒక్కొక్కటి యిస్తామని ముందుకి వచ్చారు.

శిష్టసమాజంలో అపవాదుకు, నిష్ఠూరానికి వెరచి యిటువంటివాటికి పూనుకోవాలేమో గాని మా కార్మికులం మాత్రం ఈ సామాజిక పోరాటంలో అంతిమ విజయందాకా పోరాడాలనుకున్నాం. పరిమళ మా అందరి ఇంటి ఆడపడుచూ అయింది.

సత్యం దోషి అయినా, మా వాడకట్టుకు అల్లుడు కనుక అతణ్ని దూషించకూడదన్నది అన్నపూర్ణ, శ్యామలాంబ, దుర్గ, మరియమ్మ, పుల్లమ్మ అంతాకూడా పరిమళను పెళ్ళికూతుర్ని చేశారు. కానీ పెళ్ళికొడు కేడి?

పెళ్ళికొడుకోసం నాగులు వెళ్ళి రెండురోజులైంది. నాకు ఒకప్రక్క భయంగానేవుంది. సత్యాన్ని నయానా లేదా భయాన పట్టుకొస్తానని వెళ్ళాడు నాగులు. కాని ధనంజయ రావుగారు పోలీసు రిపోర్టు యిచ్చాడేమో! లేదా సత్యం రానుపొమ్మన్నాడేమో? ఏమైందోనన్న ఆందోళన...కాని మా ఘటోత్కచుడు నాగులు సత్యాన్ని చాకచక్యంగా రైలు స్టేషనుకు రప్పించాడట - అక్కడ పిట్టలాంటి కుర్రాడు కనుక సత్యం నాగులు "తంతా" నని, పదిమందిలో పరువు తీస్తానని బెదిరించేసరికి మాట్లాడకుండ రైలెక్కాడగ.

ఆ స్తిలో చిల్లిగవ్వ రాదన్నాట్ట వాళ్ళ నాన్నగారు. పైగా ఆత్మహత్య చేసుకుంటా నన్నాట్టకూడా. సత్యం తండ్రి మాటకు లొంగిపోయి అక్కడే వుండిపోదాం అనుకున్నాట్ట కాని నాగులు పట్టుదలతో మేం పెట్టుకున్న ముహూర్తానికి మా యూనియన్ ఆఫీసుముందు పెళ్ళిపందిట్లోకి సత్యాన్ని లాక్కొచ్చాడు. సత్యం అన్నపూర్ణ మొహం అసలు చూడలేక

పోయాడు. అతని ముఖంలో పశ్చాత్తాపం పులుముకుపోయి వుంది. "అది చాలు తమ్ముడూ" అని గొణుక్కుంది అన్న పూర్ణ.

కళ్యాణమొచ్చినా, కక్కొచ్చినా ఆగదంటారే - అలా వుంది యిదంతా.

కార్మికులే ఆత్మబంధువులు. వాళ్ళ కష్టార్జితమే పెళ్ళికి పెట్టుబడి. బాజాలు మోగాయి... నేనూ, అన్నపూర్ణ పీటల మీద కూర్చున్నాం. అన్నపూర్ణకింకా మూడో నెల అయితే గియితే ఆడపిల్లే పుడితే మరి ఇరవై ఏళ్ళకి తీరే ముచ్చట... నాడే తీరింది.

ఏనాటి ఋణానుబంధమో యిది!

పెళ్ళి చదివింపులు ప్రారంభమైనాయి. మంచం, కుర్చీ, నీళ్ళకాగు, వంటగిన్నె, అన్నం కంచం, మంచినీళ్ళ గ్లాసులు, రెండు గరిటలు, చెంచా, చివరికి వారంరోజుల రేషన్ సహా చదివింపులుగా అందాయి. చివరికి పురోహితుడు ఈ సామాగ్రి పేర్లు అన్నీ అరచి అరచి అలసిపోయి "పాలబుడ్డీ, పాలపీక" చదివి...."బాబూ, యింక చాలా? ఉయ్యాలమంచంకూడా వుందా!" అని కేకేశాడు.

"అదీ పుట్టే బిడ్డగాడికి వాళ్ళ తాత తెచ్చిస్తాడులేవో" అంది మరియమ్మ.

అంతా గొల్లుమని నవ్వాం.

వాళ్ళిద్దర్నీ గదిలోకి తోసేసేముందు పరిమళా, సత్యం మా కాళ్ళకు దండం పెట్టడానికి వొంగారు.

నేను లేవదీశాను. "వద్దు సత్యం! ఇది ఒక్క దండంతో పోయేది కాదు. నువ్వు మా లేబర్ కాలనీలో వుంటూ, మనందరికీ "కన్నతల్లి" ఈ ఫ్యాక్టరీ నీడలో పిల్లల్ని, పాపల్ని కంటూ వుంటానన్న వాగ్దానం మా అందరికీ చెయ్యి" అన్నాను.

నాకింకా అతనిమీదనమ్మకం కుదరలేదు. సత్యం కళ్ళు ఎత్తి చూశాడు. ఆ కనుకొలుకుల నీరు నిల్చింది. అవి ఆనంద భాష్పాలే అనుకున్నాను నేను! వాటినే వాగ్దానంగా స్వీకరించాను.

* * *

## సుమతి

ప్రార్థనై పోయింది. ప్రయివేట్ పాఠశాల గనుక పిల్లలంతా వరుసగా క్లాసుల్లోకి చడీ చప్పుడూ లేకుండా వచ్చేశారు.

సుమతి హాజరుపట్టి తీసి పేర్లు పిలుస్తూంటే—నీలం తొడిమలున్న తెల్లని పువ్వుల్లాంటి పసిపాపలు లేచి చేతులు కట్టుకుని నిలబడి—"ప్రెజెంట్ టీచర్", "యస్ మాడమ్" అంటూ అటెండెన్సు పలికి కూర్చున్నారు.

నలభై రెండు పేర్లూ పూర్తయ్యేసరికి సుమతి మొహం మీద చిన్న పిసరు విసుగు కనపడ్డది.